నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 VIKARABAD

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి
- అధైర్యం వద్దు.. రానున్నది బీఆర్ఎస్ రాజ్యమే..
- కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే..
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



కురుమ సంఘం నాయకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 11 : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహేశ్వరం మండలం నాగారంలో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ శ్రేణులు సబితారెడ్డికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, వార్డు సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడంలేదో.. ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు. గత సంవత్సరం కేంద్రం నుంచి గాని, రాష్ట్రం నుంచి గాని గ్రామాలకు ఒక్క పైసా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఏం పని చేశారని కాంగ్రెస్, బీజేపీ నాయకులు స్థానిక సంస్థల ఓట్లు అడుగుతారన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను వారు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అలాంటి పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి అవకాశమిస్తే అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే బీజేపీ నాయకులు ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే అన్నారు. ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

### రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవలసిన అవసరం లేదని సబితారెడ్డి అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆమె కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల అయిపోయేంతవరకు అవిశ్రాంతంగా పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. మహేశ్వరం మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. సబితమ్మ ఇలాకాలో కాంగ్రెస్ బీజేపీల కథలు నడవవని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆమె పేర్కొన్నారు.

గ్రామాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు పెట్టాలంటే పోలీసులు లేకుండా ఎమ్మెల్యేలు కానీ, మంత్రులు గాని కాంగ్రెస్ నేతలు సభలకు సమావేశాలకు రావడంలేదని ఆమె ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో 72 వేల కోట్ల రైతు బంధు ఇవ్వడం జరిగిందన్నారు. 28 వేల కోట్ల రైతు రుణ మాఫీ చేయడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. ఏనాడు కూడా కేసీఆర్ ప్రచారాల ఆర్భాటం చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం ఏదీ చేయకుండానే ప్రకటనలకు పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఎప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అధికారులు అతిగా వ్యవహరిస్తున్నారని ఆమె చురకలు పెట్టారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలని ఆమె పరోక్షంగా అధికారులకు హెచ్చరిక చేశారు. అనంతరం కురుమ సంఘం నాయకులు బాలయ్య, పాండు, సురేశ్ కృష్ణయ్య, పర్వతాలు, చంద్రయ్య తదితరులను సబితారెడ్డి ఘనంగా సత్కరించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించేది నాయకులా..!

- ఎక్కడా కనిపించని అధికారులు
- రోడ్డు వేస్తున్నదెవరు? పర్యవేక్షించేది ఎవరు అంటున్న ప్రజలు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కొత్తూరు కాంగ్రెస్ నాయకులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 : అధికారులలో, ప్రజాప్రతినిధులో ప్రారంభించాల్సిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభిస్తున్నారు. పనుల ప్రారంభ సమయంలో ఉండాల్సిన అధికారుల జాడ కనిపించడంలేదు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేకపోవడంతో ప్రత్యేక అధికారులతో పాలన నడుస్తున్నది. అయితే గ్రామంలో ఏ అభివృద్ధి పని జరిగినా దాన్ని ప్రారంభించాల్సిన మండల అధికారులు, పర్యవేక్షించాల్సిన గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొనడంలేదు. అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్ నాయకులు నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారని ప్రజలు చెప్పుకొంటున్నారు.

### రూ.15.75 లక్షలతో రోడ్డు పనులు

కొత్తూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రూ.15.75 లక్షలతో ఎస్సీ కాలనీల్లో రోడ్డు మరమ్మతుల కోసం సీఆర్ఆర్ ఫండ్స్ విడుదలయ్యాయి. ఈ నిధులతో అధికారులు రోడ్డు పనులు చేయాలి. కానీ.. మండల పరిధిలోని మల్లాపూర్‌లో కొత్తూరు మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు మంగళవారం పనులు ప్రారంభించారు. ఈ పనుల ప్రారంభంలో అధికారులు ఎక్కడా కనిపించలేదు.

# 17 వరకు ఎగ్జిబిషన్ పొడిగింపు

అబిడ్స్, ఫిబ్రవరి 11 : నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను రెండు రోజులు పొడిగించేందుకు పోలీస్ శాఖ అనుమతించింది. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సభ్యులు సుఖేశ్‌రెడ్డి, ధీరజ్ జైస్వాల్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఎగ్జిబిషన్‌ను ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం స్వీకరించిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రెండు రోజులు పొడిగింపునకు అనుమతి ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ఈ సంవత్సరం మూడో తేదీ నుంచి ప్రారంభించడం జరిగిందని, దీంతో స్టాల్ యజమానులు ఎగ్జిబిషన్‌ను పొడిగించాలని విన్నవించారని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు పోలీస్ శాఖ అనుమతి కోసం వినతిపత్రం సమర్పించామని, కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

కేటీఆర్ రాకతో..

# నయా జోష్..

## గులాబీ శ్రేణులు, ప్రజల్లో నూతనోత్తేజం

- కోస్గిలో జరిగిన రైతు దీక్షా సమావేశానికి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు
- మంగళ హారతులు, నృత్యాలతో స్వాగతం పలికిన గిరిజన మహిళలు
- రహదారి పొడవునా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ అభివాదం, కరచాలనం
- జనసంద్రాన్ని చూసిన కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకుల్లో గుబులు



కేటీఆర్ రాక జోష్‌తో డ్యాన్స్ చేస్తున్న జనం (ఫైల్)

మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం కొడంగల్ నియోజకవర్గానికి వచ్చారు. కేటీఆర్ రాకతో ప్రజల్లో నూతనోత్తేజం నెలకొన్నది. కేటీఆర్‌కు గిరిజన మహిళలు మంగళహారతులు, నృత్యాలతో స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని కోస్గిలో జరిగిన రైతు దీక్షా సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా వెళ్లారు. అంతా గులాబీమయంగా మారింది. ప్రజలకు తామున్నామని కేటీఆర్ భరోసా కల్పించారు. దీక్షా సమావేశానికి వచ్చిన జనసంద్రాన్ని చూసి కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకుల్లో గుబులురేపింది. దాదాపు 14 నెలలుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు ఈ ప్రాంతంలో జరుగకపోవడంతో గులాబీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. లగచర్ల ఘటనతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులకు, ప్రజలకు పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జైలుకు వెళ్లడంతో మరింత డీలాపడిపోయారు. జైలు నుంచి వచ్చిన తరువాత గులాబీ దళంలో ఆశలు చిగురించాయి.

– కొడంగల్, ఫిబ్రవరి 11

సోమవారం జరిగిన దీక్షా సమావేశానికి కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాలతో పాటు తుంకిమెట్ల, హకీంపేట, నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో అన్ని గ్రామ తండాల నుంచి పెద్దఎత్తున జనాలు తరలివచ్చారు. దుద్యాల మండలంలోని రోటిబండతండా, పులిచెర్లకుంటతండాలు మొత్తంగా ఇండ్లకు తాళం వేసి రామన్నను కలుసుకునేందుకు కోస్గికి తరలివెళ్లారు. సభాస్థలం జనసంద్రాన్ని తలపించింది. ఎక్కడ చూసినా గులాబీమయం.. కేసీఆర్, కేటీఆర్, నరేందర్‌రెడ్డి నాయకత్వాలు వర్ధిల్లాలనే నినాదాలతో కోస్గి పట్టణం మార్మోగింది. కేటీఆర్ దీక్షా శిబిరానికి తరలివచ్చే క్రమంలో ప్రతి గ్రామం, తండా ప్రజలను పలకరిస్తూ అభివాదం, కరచాలనం చేస్తూ ముందుకు సాగారు. తుంకిమెట్లలో జెండా ఎగురవేసి, హకీంపేటలో రైతుల బాగోగులపై ఆరా తీశారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భూమిని కోల్పోతున్న రైతులు ఉదయం నుంచి కేటీఆర్ రాక కోసం తండాలు, గ్రామాల్లో వేయి కండ్లతో ఎదురుచూశారు. దాదాపు సంవత్సర కాలంగా తండాల్లో ఎటువంటి సంతోషం లేకుండా ఉండిపోయారు. మళ్లీ కేటీఆర్ రాకతో గిరిజనుల్లో నూతనోత్సాహం నెలకొన్నది. గిరిజన మహిళలు మంగళహారతులు, సాంస్కృతిక నృత్యాలతో స్వాగతం పలికారు. ఆనంద పారవశ్యంలో మునిగితేలారు. తమ బాధలను బీఆర్ఎస్ పార్టీ గుర్తించిందని పేర్కొన్నారు. వారికి తాము అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి (ఫైల్)

సభలో కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనను ఎండగట్టారు. ఇచ్చిన హామీలు, పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. లగచర్లలో భూములను పరిశీలించి.. పచ్చటి పంట పొలాలు ఉన్న భూములను తొండలు గుడ్లు పెట్టే భూములనడం ముఖ్యమంత్రి నోటికి ఏవిధంగా వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగాన్ని ప్రజలు శ్రద్ధతో విన్నారు. తమకు అండగా బీఆర్ఎస్ ఉందని సంతోషం వ్యక్తం చేశారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన భర్తను దక్కించుకునేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేసిన జ్యోతి కేటీఆర్‌ను కలిసింది. ఈ సందర్భంగా ఆమె బిడ్డకు మహా నేత పేరు పెట్టడంపై గిరిజన బిడ్డలు హర్షం వ్యక్తం చేశారు. రైతు దీక్ష సభను సక్సెస్ చేయడంలో పాలుపంచుకున్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# న్యాయం జరిగే వరకు ఉద్యమం

- నిషేధిత జాబితాలో ఉన్న భూములను వెంటనే రైతులకు అప్పగించాలి
- రైతు భరోసా, క్రయవిక్రయాలు, రుణాలకు అవకాశం కల్పించాలి
- ఇబ్రహీంపట్నంలో రైతులతో డీసీపీ నిర్వహించిన ముఖాముఖిలో ఫార్మా భూబాధితుల ఆవేదన
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి రైతులకు సరైన న్యాయం చేసేందుకు కృషిచేస్తాం
- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



ఫార్మా భూ నిర్వాసితుల సమస్యలు డీసీపీకి వివరిస్తున్న ఫార్మా భూ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కావుల సరస్వతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11 : ఫార్మాసిటీ భూబాధితులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని ఫార్మాసిటీ భూవ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కావుల సరస్వతి, రైతులు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి ఫార్మా భూ నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కావుల సరస్వతి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫార్మా బాధిత గ్రామాలైన తాటిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, మేడిపల్లి, నక్కర్త గ్రామాల్లో పర్యటించి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిషేధిత జాబితాలో ఉన్న రైతుల భూములను తొలగించి యథావిధిగా అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కోదండరెడ్డితో పాటు పలువురు గ్రామాల్లో పర్యటించినప్పుడు చెప్పిన మాటప్రకారమే తొలగించాలని కోరుతున్నామన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి నేటికీ నెరవేర్చకుండా కాలయాపన చేస్తుండడంతో బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె డీసీపీ దృష్టికి తీసుకువచ్చారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు రైతు భరోసా అందటంలేదని, అలాగే పంట రుణాలు, ఇతర మార్టిగేజ్ రుణాలు, క్రయవిక్రయాలు జరగడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. రైతులకు సరైన న్యాయం చేయాలని గత కొన్నేళ్లుగా పోరాటాలు చేపడుతున్నప్పటికీ కాలయాపన చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాసిటీ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు సంబంధించిన సమస్యలు పూర్తిగా తెలుసుకునేందుకే ఇబ్రహీంపట్నంలో రైతులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రైతుల సమస్యలు పూర్తిగా తెలుసుకుని పూర్తి నివేదికను రాచకొండ సీపీ సుధీర్‌బాబు సహకారంతో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఆమె తెలిపారు.

### హామీలను వెంటనే నెరవేర్చాలి

గత ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నానక్‌నగర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు.. ఎన్నికల ముందు ఈ ప్రాంత నాయకుడు కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు సీతక్క, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమకుమార్‌రెడ్డి రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఈ ప్రాంతంలో ఫార్మాసిటీని రద్దుచేస్తామని చెప్పి నేడు మొహం చాటేయటం సిగ్గుచేటన్నారు. వెంటనే ఫార్మాసిటీ రద్దుతో పాటు బాధిత రైతులకు సరైన న్యాయం చేయాలని కోరారు.

### ఎన్ని అడ్డంకులొచ్చినా మా భూములు మాత్రం ఇవ్వం

మాకున్న అసైన్డ్‌మెంట్ భూమిని పూర్తిగా తీసుకున్నారు. పొద్దునలేస్తే కాయకష్టం చేసుకుని, భూమిని నమ్ముకుని జీవిస్తున్నాం. చిన్నప్పటి నుంచి కష్టపడి కాపాడుకున్న మాకున్న పట్టా భూములను లాక్కుంటామని బెదిరిస్తున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా మా భూమిని మాత్రం ఇవ్వం. బలవంతంగా భూమిని లాక్కోవాలని చూస్తే ఊరుకోం.



– ఆవ గుండాలు, కుర్మిద్ద

### ఈ సర్కారుపై మాకు నమ్మకంలేదు


ఇప్పుడున్న కాంగ్రెస్ సర్కారులో ఉన్న పెద్దమనుషులపై మాకు నమ్మకంలేదు. ఓట్లకు ముందు మా గ్రామంలోకి వచ్చి ఇక్కడ ఫార్మాసిటీని ఏర్పాటు చేయనివ్వం. మీ దగ్గర తీసుకున్న భూములు తిరిగి మీకే ఇప్పిస్తాం. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలగింపజేసి అందజేస్తామని చెప్పి నేడు ఎవరూ కనిపిస్తలేరు. ఎన్నికల ముందు ఎన్నెన్నో మాటలు చెప్పి, ఇయ్యాల ఏసీ రూంలల్ల పండుకుని నీలుగుతున్నారు.



– ఎల్లయ్య, తాటిపర్తి రైతు

# భారీగా కోడి పందేలు

- 80 పందెం కోళ్లు.. రూ.30 లక్షల నగదు స్వాధీనం
- అదుపులో 50 కార్లు.. 64 మంది పందెంరాయుళ్లు



కోడి పందేలలో పాల్గొన్న పందెంరాయుళ్లతో పోలీసులు

మొయినాబాద్, ఫిబ్రవరి 11 : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ రెవెన్యూలో ఓ వ్యవసాయ క్షేత్రంలో భారీఎత్తున కోడి పందేలు నిర్వహించారు. హైదరాబాద్ నగరంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు పెద్దఎత్తున కోడి పందేలు నిర్వహిస్తున్నారని ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో కోళ్ల పందేల శిబిరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. కోడి పందేలు అడుతున్నారని తెలియడంతో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తమ 50 మంది సిబ్బందితో కోడి పందేల శిబిరానికి చేరుకున్నారు. పోలీసులు వ్యవసాయ క్షేత్రంలోనికి వెళ్లేసరికి పెద్దఎత్తున కోడి పందేలు నిర్వహించడంతో పోలీసులే ఆశ్చర్యానికి గురయ్యారు.పోలీసులు వ్యవసాయ క్షేత్రంలో భారీగా మోహరించడంతో కోడి పందేల నిర్వాహకుడు భూపతిరాజు శివకుమార్‌వర్మ, పందెంరాయుళ్లు ఎటూ పోకుండా పోలీసులు చుట్టుముట్టి వారిని నిర్బంధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివకుమార్ 64 మంది పందెం రాయుళ్లు, 80 కోళ్లతో కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేళ్లను ఆడించడానికి బెట్టింగ్ రూ.30 లక్షలు పెట్టినట్టు సమాచారం. కోడి పందేలు ఆడుతున్న వారి నుంచి రూ.30 లక్షలు, 80 కోళ్లు, 50 కార్లను స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేలలో పాల్గొన్న 64 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఫామ్‌హౌస్‌లో పందెం కోళ్లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు